క్లుప్తంగా

కేజీహెచ్‌లో రోగికి పింఛను అందజేత


కేజీహెచ్‌లో గంగకు పింఛను అందజేస్తున్న గ్రామ వలంటీర్

ఎస్.రాయవరం : పింఛను నగదు ప్రారంభం రోజే వమ్మవరం గ్రామానికి చెందిన వితంతువు శిరసపల్లి గంగకి కేజీహెచ్‌లో బుధవారం పింఛను నగదు గ్రామ వలంటీర్ శ్రీకాంత్ అందజేశారు. వలంటీర్ శ్రీకాంత్ బుధవారం వేకువ జామున తన క్లస్టర్ పరిధిలో ఉన్న పింఛన్లు పంపిణీ చేసి, అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గంగకి 86 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి పింఛను నగదు అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తామని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ అప్పలనాయుడు పేర్కొన్నారు. మునగపాక పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు ఆయన బుధవారం పింఛన్లు అందజేశారు. రాజకీయాలకు అతీతంగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి


మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : మహిళలు రక్తహీనతకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగపాక పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తాజా ఆహారంతో పాటు శ్రేష్టమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈవో అజయ్ బాబు, మహిళా పోలీసులు వరలక్ష్మి, శ్రావణి, ఏఎన్ఎం దేవకి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు జాబితాను సరిచేయాలి

మునగపాక : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో చోటు చేసుకున్న తప్పులను సవరించాలని కోరుతూ బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట వామపక్ష నేతలు ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు అధికారుల తప్పిదం కారణంగా అనర్హుల పేర్లు జాబితాల్లో ఉన్నాయన్నారు. మునగపాక మండల పోలింగ్ స్టేషన్ పరిధిలోని వారికి మాత్రమే ఓటరు అవకాశం కల్పించాల్సి ఉందని, అయితే ఇతర జిల్లాలకు చెందిన వారిని ఈ జాబితాలో చేర్చడం సరికాదన్నారు. దీనిపై విచారణ చేపట్టి ఓటరు జాబితాను సరి చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు,బ్రహ్మాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరదేశమ్మ ఆలయ ముఖద్వారానికి గేటు ఏర్పాటు


తోటాడలో పరదేశమ్మ ఆలయ ముఖద్వారం గేటు ఏర్పాటు

మునగపాక : మండలంలోని తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల ఇలవేల్పు పరదేశమ్మ ఆలయ ముఖద్వారం వద్ద ఇనుప గేటును బుధవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఈ గేటును ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ గేటు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దొడ్డి బాలాజీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు బాసటగా జగనన్న చేదోడు

- హర్షం వ్యక్తం చేసిన నాయీబ్రాహ్మణులు
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


యలమంచిలిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

యలమంచిలి : జగనన్న చేదోడు పథకం ద్వారా కుల వృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న రాష్ట్రంలో నాయీబ్రహ్మణుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా అన్నారు. బుధవారం యలమంచిలిలో నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు అధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా చేతివృత్తుల వారికి ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర సమయంలో నాయీబ్రాహ్మణుల కష్టాలను స్వయంగా తెలుసుకున్న జగనన్న అధికారంలోకి రాగానే చేదోడు పథకం ద్వారా రూ. 10వేలు అందిస్తున్నారని, సంక్షేమ పథకాల్లో కోత విధించకుండా నాయీబ్రహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కంది కుప్ప గోవిందరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రూ. 10వేలు చొప్పున తమ ఖాతాల్లో వేయడం తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందని సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేతివృత్తుల వారికి సబ్సిడీ రూపంలో డబ్బులు కట్టించుకొని తమకు అందాల్సిన పరికరాలు అందించేవారు కాదని, జన్మభూమి కమిటీ సభ్యులు, తెలుగుదేశం నాయకులు చేతివాటం ప్రదర్శించేవారని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నేరుగా తమ వద్దకే అందిస్తున్నారని అన్నారు. కాగా ఆర్థికంగా వెనుకబడిన నాయీబ్రాహ్మణులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ చేదోడు పథకం ఒక వరమని యలమంచిలికి చెందిన చల్లపల్లి రామత్రినాథ్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ డాక్టర్ త్రినాథరావు, నాయీబ్రాహ్మణ సంఘం కోశాధికారి చల్లపల్లి సతీష్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి వెన్నెముక

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమ అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి 24వ వార్డు ఎన్‌టీఆర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులతో సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 24వ వార్డు సచివాలయ పరిధిలో ఉన్న కొత్తపాలెం, రామారాయుడుపాలెం , తులసీనగర్ ఎన్‌టీఆర్ కాలనీల్లో అభివృద్ధి పనులకు రూ.34.5 కోట్ల నిధులు మంజూరు చేశామని, సంక్షేమ పథకాల మంజూరుతో పాటు అత్యధికంగా మున్సిపాలిటీలో అభివృద్ధికి పాటుపడుతున్నామని అన్నారు. ఎన్‌టీఆర్ కాలనీలో మురుగునీటి సమస్య, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపాలని, కాలనీలో రామాలయం నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని నాగేష్ (నాగు) ఎమ్మెల్యేకు విన్నవించగా ఎమ్మెల్యే ఆమేరకు హామీ ఇచ్చారు. 24వార్డులో రూ.8.5 కోట్లతో ఏఐఐబీ మంచి నీటి పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు నిధులు కేటాయించామని, నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి రూ.48.5 లక్షలతో నిధులు కేటాయించామని, రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులను మంజూరు చేశామని, మున్సిపాలిటీలో ఇల్లు లేని పేదలకు యర్రవరం వద్ద 620 టిడ్కో ఇళ్ళు మంజూరు చేశామని తెలిపారు. ఇంకా ఎవరైన లబ్ధిదారులు మిగిలిపోతే వలంటీర్లు వారి వద్ద నుంచి అర్జీలు స్వీకరించి, అర్హులను గుర్తించి ఎంపిక చేస్తే సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. అనంతరం వలంటీర్లకు వాటర్ ప్రూఫ్ బ్యాగులను అందించారు. వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి వెన్నెముక వంటిదని, వారికి మంచి భవిష్యత్తు ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కూర్మి నాయుడు

నక్కపల్లి : జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్టు అధికారి కూర్మినాయుడు ఆదేశించారు. బుధవారం నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణానికి శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ మండలంలో ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో లేదన్నారు. కలెక్టర్ అసంతృప్తిగా వున్నారన్నారు. తక్షణమే లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభింపచేయాలన్నారు. లబ్ధిదారులకు ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇసుక, సిమెంటు, ఐరన్ అందుబాటులో ఉంచామన్నారు. సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈ ప్రసాద్, ఏఈ రామకృష్ణ, ఎంపీడీవో సీతారామరాజు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన డీపీవో


కేంద్రాన్ని సందర్శించిన డీపీవో శిరీషారాణి

నక్కపల్లి : మండల కేంద్రంలో పునర్ నిర్మించిన సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి బుధవారం సందర్శించారు. ఇక్కడ త్వరలో క్లాప్ కార్యక్రమంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు, స్వీపర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. సుమారు 8 మండలాలకు సంబంధించిన స్వచ్ఛ సంకల్పం క్లీన్ ఆంధ్రప్రదేశ్‌పై ఇక్కడ శిక్షణ, అవగాహన కల్పిస్తారని ఆమె చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీ వర్మీకంపోస్టు ఎరువుల తయారీ, విక్రయాలు చేపట్టడంపై అవగాహన కల్పిస్తానన్నారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ వెంకటనారాయణ, కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ వీసం రాజు ఉన్నారు.

ప్రేమ సమాజంలో తులసీరావు జన్మదిన వేడుకలు


వృద్ధులకు భోజనాలు పెడుతున్న ఆనంద్ మిత్ర మండలి

యలమంచిలి : ఆడారి తులసీరావు జన్మదినం పురస్కరించుకొని యలమంచిలి మున్సిపాలిటీ కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో వృద్ధులకు ఆనంద్ మిత్ర మండలి,తులసీరావు అభిమానులు ఆధ్వర్యంలో బుధవారం భోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మిత్రమండలి సభ్యుడు ఆడారి వెంకట్ మాట్లాడుతూ ఆడారి తులసీరావు ఆశ్రమాలకు ఇక్కడ వృద్ధులకు ఎంతో సహాయ సహకారాలు అందించేవారని వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేసేవారని తెలిపారు. సేవాతత్పరత కలిగిన వ్యక్తి తులసీరావు లేని లోటు తీరనిది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సందరపు బాబ్జీ, ఆడారి నాయుడు తదితరులు తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

4న గౌరీపరమేశ్వరుల ఉత్సవం


ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

మునగపాక : గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఐటీ, వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. ఈ నెల 4వ తేదీన మునగపాకలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి తొలి శనివారం నిర్వహించే ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఉత్సవ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించేలా చూడాలన్నారు. ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఉత్సవకమిటీ చైర్మన్ ఆదినారాయణ, కార్యదర్శి అప్పలనాయుడు, వెంకట్,భరణి పాల్గొన్నారు.

5 న మోదకొండమ్మ తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోడూరులో గ్రామ దేవత మోదకొండమ్మ తీర్థాన్ని ఈనెల 5న భారీగా నిర్వహించనున్నట్టు సర్పంచ్ గొళ్ళవిల్లి సంజీవరావు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం, ముగ్గుల పోటీలు, భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు


ఆకట్టుకున్న సారె ఊరేగింపు

మునగపాక : మునగపాకలో గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈనెల 4వ తేదీన జరగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో సారె ఊరేగింపు నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి ఇందిరమ్మ కాలనీ, మెయిన్‌రోడ్డు, పల్లపు వీధి, సంతబయిల, మధ్యవీధి, పంచాయతీ వీధి మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. మహిళలు తయారు చేసిన పలు రకాల పిండివంటలు నోరూరించాయి. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు పొలిమేర అప్పలనాయుడు(దత్తుడు), కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు టెక్కలి కొండలరావు, పెంటకోట సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, ఆడారి సూర్య చంద్రరావుతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి


జీఎంఎఫ్‌సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

రాంబిల్లి : జీఎంఎఫ్‌సీ ఫార్మా కంపెనీలో రియాక్టర్లు పేలి మృతి చెందిన రామారావు కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. బుధవారం ఆయన జీఎంఎఫ్‌సీ ఫార్మా కంపెనీని సందర్శించి ప్రమాద తీరును ఆయా కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

బాధితురాలికి న్యాయం చేస్తా..

పాయకరావుపేట : దళితులు, మహిళల పట్ల ఎటువంటి వేధింపులు జరిగినా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సహించదని మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు అన్నారు. బుధవారం ఆయన పి.ఎల్.పురంలో వీఆర్‌వోతో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళను పరామర్శించడానికి వెళ్ళారు. ఆమె వేరే ఊరు వెళ్ళడంతో ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి ఇంటి స్థలం మంజూరు చేయిస్తామన్నారు. ఈ ఘటన పై ప్రభుత్వం, జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారన్నారు. వీఆర్‌వోని సస్పెండ్ చేసి, అతనిపై ఏస్సీ, ఏస్టీ అట్రాసిటీ వేధింపుల కేసు నమోదు చేసి అరెస్టు చేసారన్నారు. ఇంటువంటి సంఘటనలకు పాల్పడిన వారిని ప్రభుత్వం వదిలే ప్రసక్తి లేదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈయనతో పాటు గ్రామ సర్పంచ్ పడాల సోమన్నదొర ఉన్నారు.

ఘనంగా లక్ష్మీ మాధవస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో హేమగిరి పర్వతంపై వేంచేసియున్న శ్రీ లక్ష్మీమాధవస్వామి కల్యాణ మహోత్సం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, అంకురార్పణ , ధ్వజారోహణ చేసి స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణతో స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం

మునగపాక : పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ఆర్‌డీవో చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గంగాదేవిపేట పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తోటాడ రెవెన్యూ పరిధిలోని రైతులు, రహదారి విస్తరణ బాధితులతో బుధవారం సాయంత్రం సమావేశం అయ్యారు. భూ చట్ట ప్రకారం పరిహారం అందించేలా కృషి చేస్తామన్నారు. బాధితుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సీఐటీయూ నేత బ్రహ్మాజీ, రైతులు బొద్దపు శ్రీరామమూర్తి, నరాలశెట్టి తాతారావు పాల్గొన్నారు.

నేడు గ్రహణం మొర్రి చికిత్స శిబిరం

ఎస్.రాయవరం : గ్రహణం మొర్రి, సూల సమస్యలు ఉన్న దివ్యాంగ పిల్లలకు ఉచిత వైద్య శిబిరం ద్వారా అవసరమైన చికిత్స అందజేసేందుకు అవకాశం ఉందని మండల విద్యాశాఖాధికారి మూర్తి తెలిపారు. అనకాపల్లి శ్రీ గౌరి గ్రంథాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏపీ శిక్ష ఆధ్వర్యంలో బసవతారకం స్మైల్‌ట్రిన్ సెంటర్ వారు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గోకులపాడులో పాఠశాలలో ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులు కూడా అవసరమయితే వైద్య శిబిరానికి వెళ్లవచ్చని చెప్పారు.

మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ


మృతుడు పక్కుర్తి అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : నామవరం గ్రామంలో సోమవారం రాత్రి లారీ ఢీకొట్టడంతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బొట్టా కృష్ణ (40), పక్కుర్తి అప్పారావు (60) రోడ్డు పక్కన నిలుచుని ఉండగా వారిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. ఆయా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరామర్శించి, ధైర్యం చెప్పారు. విద్యావంతులు వుంటే ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాయకరావుపేట, నక్కపల్లి సీఐలతో ఫోన్‌లో మాట్లాడారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో జాతీయ రహదారికి వున్న కూడళ్ళ వద్ద స్టాపర్స్ బోర్డులు (వేగ నియంత్రణ) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, రామాలయం చైర్మన్ గదుల లోరాజు, పీఏసీఎస్ చైర్మన్ లత వున్నారు.

మృతుడు రాజీవ్ కుటుంబానికి ఓదార్పు

ఎస్.రాయవరం : ఇటీవల ప్రమాదవశాత్తూ మేడపై నుంచి జారిపడి మృతిచెందిన కర్రి రాజీవ్‌గాంధీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బుధవారం పరామర్శించారు. మృతుడు రాజీవ్‌పై ఆధారపడి భార్య శివకుమారి, ముక్కుపచ్చలారని మూడు నెలల పాప, తల్లి మంగామణి ఉన్నారు. ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని, మృతుడి భార్యకు ఉపాధి కలిగే ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, కర్రి పెద అబ్బాయి ఉన్నారు.

ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ


ఎంపీటీసీ సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : పాల్తేరు గ్రామ ఎంపీటీసీ (రెండవ సిగ్మెంట్) సభ్యుడు ఇసరపు సత్యనారాయణను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరామర్శించారు. సత్యనారాయణ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. కొంతకాలంగా ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ కారణంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆయనను పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ జిల్లా కార్యదర్శి దేవవరపు వెంకటేశ్వరరావు, పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కొంకిపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో 'ప్రజల వద్దకు పాలక మండలి'


వలంటీరుతో పాటు పింఛను పంపిణీలో పాల్గొన్న వార్డు మెంబరు సత్యనారాయణ

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం ప్రతి లబ్ధిదారునికి అర్థమయ్యేలా వివరిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పైల రమేష్ తెలిపారు. కె.వెంకటాపురంలో 'ప్రజల వద్దకు పాలక మండలి' కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పాలక మండలి సభ్యులు విధిగా తమ పరిధిలో ఉన్న వలంటీరుతో పాటు లబ్ధిదారుని వద్దకు వెళ్లి సంక్షేమాన్ని వివరించనున్నట్టు తెలిపారు. పింఛన్ పంపిణీ ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే కాకుండా అవ్వా, తాతలకు పింఛను నగదును ఏటా పెంచుతూ వెళుతున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతలా ప్రజలకు అండగా ఉండలేదన్నారు. ఈ విషయాన్నే ప్రతి లబ్ధిదారుకు వివరిస్తామని, ఇకపై ఏ సంక్షేమ పథకం వచ్చినా పాలకమండలి సభ్యులందరూ తమ పరిధిలో లబ్ధిదారులను కలుసుకుంటారని తెలిపారు. తమ గ్రామంలో 23 మంది గ్రామ వలంటీర్లతో పాటు 12 మంది వార్డు సభ్యులు పింఛను పంపిణీలో పాల్గొన్నట్టు తెలిపారు.

12 మంది ఆయాలకు నియామక పత్రాలు


ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఆయా నియామకపు పత్రాన్ని అందిస్తున్న సీడీపీవో సుజాత

కోటవురట్ల : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ ఆయాలుగా ఎంపికైన 12 మంది అభ్యర్థులకు సీడీపీవో సుజాత బుధవారం నియామకపు పత్రాలను అందజేశారు. సీడీపీవో సుజాత మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో కోటవురట్ల మండలంలో 7, నాతవరం మండలంలో 5 అంగన్‌వాడీ ఆయా పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు. కోటవురట్ల మండలంలో రాజుపేటలో ఇద్దరు, కె.వెంకటాపురం , కొడవటిపూడి, అల్లుమియ్యపాలెం, యాషాడపాలెం, బలిరెడ్డిపాలెం గ్రామాలలో ఒక్కొక్కరికి, నాతవరం మండలంలో లింగంపేట, నాతవరం, ములగపూడి, కె.ఆర్.సి.పురం, మాసాపల్లి గ్రామాల్లో ఒక్కొక్కరికి నియామకపు పత్రాలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పైల రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లపు కుమారరాజా, మాజీ సర్పంచ్ బాలేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి


రాజగోపాలస్వామి ఆలయంలో పూజలు


ఒంపోలు రామాలయంలో భజనలు

కోటవురట్ల : మండలంలో భీష్మ ఏకాదశిని బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. కైలాసపట్నంలోని శ్రీ రాజగోపాలస్వామి ఆలయంలో స్వామికి విశేష పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మునగపాక : మండల వ్యాప్తంగా బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒంపోలు గ్రామంలో ఉదయం నుంచి ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏకాహం కార్యక్రమం నిర్వహించారు. 24 గంటల పాటు ఓం నమశ్శివాయ నామస్మరణ కార్యక్రమం చేపట్టారు. పలువురు భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం నేడు

రాంబిల్లి: వాడనర్సాపురం గ్రామంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పాస్టర్ జేమ్స్ తెలిపారు. విశాఖపట్నం గీతం ఆసుపత్రి వైద్యులు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలందిస్తారని, ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.